క్లుప్తంగా

ప్రయాణాలు వాయిదా వేసుకోండి

ఐటీడీఏ పీఓ సూర్యతేజ



మనుగోపుల గ్రామంలో గిరిజనులతో మాట్లాడుతున్న పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మరో రెండురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గిరిజన ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ అన్నారు. గురువారం పలు గ్రామాల్లో ఆయన పర్యటించి గిరిజనులకు కలిసి వరద పరిస్థితులు, సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఏజెన్సీలో కొండవాగులు పొంగిపొర్లుతున్నందున ప్రజలు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలన్నారు. వాగులు పొంగే సమయంలో ఎవరూ దాటే ప్రయత్నం చేయొద్దని అన్నారు. వాగుల ప్రదేశాల్లో ప్రమాదాలు జరగకుండా రెవెన్యూ, పోలీస్ పికెటింగ్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. గిరిజన ప్రాంతంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు శుక్రవారం సెలవుదినంగా ప్రకటించారు.

బాలికల సంరక్షణే మిషన్ శక్తి లక్ష్యం

కామవరపుకోట: బాలికల, మహిళల సంరక్షణే మిషన్ శక్తి లక్ష్యం అని జంగారెడ్డిగూడెం డివిజన్ అంగన్‌వాడీ సీడీపీవో పి.బ్యూలా అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మిషన్ శక్తిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోక్సో ఉమెన్ హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 నంబర్లపై గ్రామస్థాయిలో ప్రతి మహిళకు అవగాహన కల్పించేలా కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు బీవీఎల్ మంగాదేవి, ఎన్.వీరాకుమారి పాల్గొన్నారు.

బస్సులోనూ వర్షమే..

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం నుంచి కోయిదా వెళ్లే బస్సులో వర్షం కురుస్తుండడంతో ప్రయాణికులు చాలా అవస్థలు పడుతున్నారు. కొద్దిరోజుల క్రితం ఆర్టీవో ద్వారా వార్తలు ప్రచురించగా రెండు రోజులు వేరే బస్సును ఏర్పాటు చేశారు. అనంతరం మళ్లీ పాత బస్సునే కొనసాగిస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం పడిన వర్షానికి ప్రయాణికులు బస్సులో గొడుగు వేసుకుని ప్రయాణించారు. అధికారులు స్పందించి మంచి బస్సును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బాలికల వసతి గృహం తనిఖీ

చింతలపూడి: చింతలపూడి పట్టణంలోని బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాత్రిళ్లు కరెంట్ పోతే చదువుకోవడానికి ఇబ్బందిగా ఉంటోందని, తాగునీటికి ఇబ్బందిగా ఉందని బాలికలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన రూ.20 వేలతో ఇన్వర్టర్ ఏర్పాటు చేయించారు. త్వరలోనే మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. హాస్టల్ వద్ద నుంచి మెయిన్ రోడ్డు వరకు డ్రెయిన్ ఏర్పాటు చేయాలని నగర పంచాయతీ కమిషనర్‌ను ఆదేశించారు. సొంత నిధులతో బాలికలకు అల్పాహారం అందిస్తానని ప్రకటించారు.

సమగ్ర పంటల బీమా పథకం అమలు చేయాలి

ద్వారకాతిరుమల: సమగ్ర పంటల బీమా పథకాన్ని అమలు చేసి, బీమా ప్రీమియంను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ఎం.నాగులపల్లి సచివాలయంలో వ్యవసాయ అసిస్టెంట్‌కు రైతు సంఘం నాయకులు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. రైతు సంఘం మండల అధ్యక్షుడు బోయపాటి సత్యనారాయణ, తూంపాటి మురళి తదితరులు పాల్గొన్నారు.

పంగిడిగూడెంలో ఘరానా మోసం

ద్వారకాతిరుమల: ఒక వ్యాపారి దగ్గర దొంగిలించిన సిమెంట్ బస్తాలను.. మరో వ్యాపారికి అమ్మి సొమ్ము చేసుకున్నాడో ఘరానా మోసగాడు. అతడిపై ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఎస్సై జి.సతీష్ తెలిపిన కథనం ప్రకారం.. పంగిడిగూడెంకు చెందిన వ్యాపారి ఉదయగిరి సాయిబాబుకు గ్రామంలో ఐరన్ షాపు ఉంది. ఈనెల 1న అపరిచిత వ్యక్తి సాయిబాబుకు ఫోన్ చేసి తన పేరు పసుపుల శ్రీధర్ అని, విజయవాడలోని సాయి బాలాజీ హోల్‌సేల్ షాపు వ్యాపారినని చెప్పి పరిచయం చేసుకున్నాడు. తాను అన్ని కంపెనీల సిమెంట్‌ను తక్కువ ధరకు అమ్ముతానని నమ్మబలికాడు. అదేరోజు మా లోడు వచ్చిందని చెప్పి సాయిబాబు షాపు వద్ద 300 కేసీపీ సిమెంట్ బస్తాలను దింపి, వెంటనే తనకు డబ్బులు ఫోన్‌పే చేయాలన్నాడు. దీంతో లోడు దింపిన వ్యక్తి చూపిన స్కానర్‌కు సాయిబాబు రూ.80,850 ఫోన్‌పే చేశాడు. మరుసటి రోజు ఏలూరులోని ఒక సిమెంట్ షాపు యజమాని, లారీ డ్రైవర్ కలసి సాయిబాబు షాపు వద్దకు వచ్చి, మా సిమెంట్ బస్తాలను మీరు తీసుకున్నారని, వాటిని తీసుకెళతామని చెప్పడంతో సాయిబాబు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. తాను మోసపోయినట్లు గుర్తించి సదరు ఏలూరుకు చెందిన వ్యాపారికి రూ.87 వేలు ఇచ్చి, సిమెంట్ బస్తాలను తన వద్దే ఉంచుకున్నాడు. ఈ ఘటనపై సాయిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏజెన్సీ అతలాకుతలం

- పొంగిపొర్లుతున్న కొండవాగులు
- రాకపోకలకు పలుచోట్ల అంతరాయం
- స్తంభించిన జనజీవనం

బుట్టాయగూడెం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కుండపోతగా కురుస్తున్న భారీ వర్షాలతో ఏజెన్సీ ప్రాంతం అతలాకుతలమైంది. ఎడతెరిపి లేకుండా బుధవారం అర్ధరాత్రి నుంచి వర్షాలు కురుస్తూనే ఉండడంతో వరదనీరు భారీగా చేరి కొండవాగులు పొంగిపొర్లుతున్నాయి. వాగుల ఉధృతికి రహదారులపై వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. బుట్టాయగూడెం మండలంలోని ఇప్పలపాడు సమీపంలో ఉన్న జల్లేరు వాగు, వీరన్నపాలెం కాల్వ, కేఆర్‌పురం సమీపంలోని వాగు, పులిరామన్నగూడెం సమీపంలోని దాటు కాల్వ, కొవ్వాడ కాల్వ, చింతకొండ సమీపంలోని కాల్వ, అల్లి కాల్వ ఇలా పలు కాల్వలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అదేవిధంగా కామవరం, బూరుగువాడ, వేపులపాడు, రామచంద్రాపురం కాల్వలు కూడా పొంగిపొర్లుతున్నాయి. పంట పొలాల్లోకి భారీగా నీరు చేరి అవి చెరువులను తలపిస్తున్నాయి. వర్షానికి వరదనీరు భారీగా చేరడంతో గ్రామాల్లో రోడ్లన్నీ జలమయంగా మారాయి. పలు ఇళ్లల్లోకి వరదనీరు వచ్చి చేరింది. మండలంలోని రెడ్డిగణపవరం వెళ్లే రహదారిలో ఓ ప్రైవేటు పాఠశాల బస్ వాగులో చిక్కుకుపోయింది. ఆ సమయంలో ఐదుగురు విద్యార్థులు బస్‌లో ఉన్నారు. కొందరు స్థానికులు, విద్యార్థుల సహాయంతో బస్‌ను బయటకు లాగారు.

పోలవరంలో పొంగుతున్న కొండవాగులు

పోలవరం రూరల్: పోలవరం మండలంలోని కొండవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. కొవ్వాడ కాలువ, ఇసుక కాలువ, పేడ్రాల కాలువ, నక్కలగొయ్యి కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గుంజవరం గ్రామ సమీపంలో ప్రధాన రోడ్డు మార్గంలోని పేడ్రాల కాలువ పొంగి ప్రవహించడంతో ప్రజల రాకపోకలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. పొలాల్లోకి భారీగా వర్షం నీరు చేరింది. గ్రామాల్లో పల్లపు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. భారీ వర్షాలతో కొండవాగులు రోడ్లపై పొంగి ప్రవహించే ప్రాంతాల్లో పోలీసులు గస్తీ ఏర్పాటు చేసినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. కొవ్వాడ కాలువ అధిక జలాలు పట్టిసం ఔట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరి నదిలోకి చేరుతున్నాయి.

పది గ్రామాలకు నిలిచిన రాకపోకలు

కుకునూరు: తుపాను ప్రభావంతో గురువారం ఉదయం నుంచి కురుస్తున్న కుంభవృష్టి వర్షానికి కొండవాగులు ఉధృతంగా ప్రవహించాయి. కుక్కునూరు నంంచి దాచారం వెళ్లే మార్గమధ్యలో గుండేటి వాగు ఉధృతంగా వంతెన మీదుగా ప్రవహించడంతో వంతెన కోతకు గురైంది. దీంతో కుక్కునూరు మీదుగా 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అంతేగాక మండలంలోని పాలవాగు, రాళ్లవాగు, పాములేరు వాగు రెడ్డిగూడెం గ్రామం వద్దగల పెదవాగు ఉధృతంగా ప్రవహించడంతో పలుచోట్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కొత్త లంకాలపల్లి గ్రామం చేరువలోకి గుండేటివాగు వరద దూసుకు రావడంతో గ్రామస్తులు ఇళ్లను ఖాళీ చేశారు. దాచారం – వసంతవాడ మధ్యలో వాగు పొంగడంతో దాచారం, వేలేరుపాడు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కుక్కునూరు నుంచి అశ్వారావుపేట వెళ్లే దారిలో కొర్లకుంట గ్రామం వద్ద వర్షం నీరు ఉధృతంగా రోడ్డుపై ప్రవహించడంతో చిన్న వాహనాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు.



కొయ్యలగూడెం: కన్నాపురం బుట్టాయిగూడెం కాజ్ వేపై ఉధృతంగా పడమటి కాలువ



బుట్టాయగూడెం: వేపులపాడు సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



పోలవరం రూరల్: పోలవరం ప్రధాన రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



కుక్కునూరు: వంతెన మీదుగా ప్రవహిస్తున్న గుండేటి వాగు ఉగ్రరూపం



బుట్టాయగూడెం: పాలకుంటలో ఇళ్లలోకి ప్రవేశించిన వరదనీరు



బుట్టాయగూడెం: కేఆర్‌పురం కాల్వ వద్ద పరిస్థితి ఇలా..



పోలవరం రూరల్: గుంజవరం గ్రామ సమీపంలో ప్రధాన రోడ్డుపై పేడ్రాల కాలువ

కుండపోత వర్షం

టి.నరసాపురం: మండలంలో కుండపోతగా వర్షం కురుస్తోంది. మండలంలోని అప్పలరాజుగూడెం – మధ్యాహ్నపువారిగూడెం రహదారిలోని ఎర్ర కాలువ, బండివారిగూడెం – గంగినీడుపాలెం రహదారిలోని ముగ్గురాతి వాగు, టి.నరసాపురం – మక్కినవారిగూడెం మధ్య ప్రవహిస్తున్న జమ్మి వాగు పొంగి పొర్లుతున్నాయి. దీంతో ఆయా రహదారుల్లోని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాగా ముంపు సమస్యను ఎదుర్కొంటున్న టి.నరసాపురం, బొర్రంపాలెం గ్రామాల ప్రజలు ఈ భారీ వర్షాలకు వరద ముంచెత్తి తమ ఇళ్లపై పడుతుందేమో అని భయపడుతున్నారు.

ఉప్పొంగిన కాలువలు

కొయ్యలగూడెం: తుపాను వల్ల ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ప్రధాన కాలువలు ఉప్పొంగి ఉధృతంగా ప్రవహించాయి. గురువారం కన్నాపురం పోలవరం రోడ్డులో తూర్పు కాలువ కన్నాపురం బుట్టాయిగూడెం రోడ్డులో పడమటి కాలువలు ఉధృతంగా ప్రవహించడంతో బుట్టాయిగూడెం, పోలవరం మండలాలకు వెళ్లే ప్రయాణికులు ఎక్కడికక్కడే నిలిచిపోయారు. కొయ్యలగూడెం పోలవరం రోడ్డును వరద నీరు ముంచెత్తడంతో పరిసర నివాసిత ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ప్రధాన రహదారులపై ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువల వద్ద రెవెన్యూ సిబ్బంది నిఘా కొనసాగిస్తున్నారు.

విద్యుత్ అంతరాయాల పునరుద్ధరణకు..

జంగారెడ్డిగూడెం: భారీ వర్షాలు, వరదల కారణంగా విద్యుత్ అంతరాయాల పునరుద్ధరణ కొరకు జంగారెడ్డిగూడెం డివిజన్ ఆఫీస్ నందు కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు జంగారెడ్డిగూడెం డివిజన్ విద్యుత్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యలు ఉంటే కంట్రోల్ రూం ఫోన్ నెంబర్ – 9491030712, 9491030713లలో సంప్రదించాలన్నారు.

ప్రాజెక్టులకు జలకళ



భారీ వర్షాలకు ఎర్రకాల్వ ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీరు దిగువకు విడుదల చేసిన దశ్యం

చింతలపూడి: అల్ప పీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రాజెక్టులు, చెరువులకు వరద నీరు వచ్చి చేరుతోంది. ముఖ్యంగా జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టులైన ఎర్రకాల్వ, తమ్మిలేరు ప్రాజెక్టుల నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. ఎప్పటి కప్పుడు వరద పరిస్థితులను ఇరిగేషన్ అధికారులు సమీక్షిస్తున్నారు. జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం వద్ద కరాటం కృష్ణమూర్తి (ఎర్రకాల్వ) జలాశయం ఎఫ్ఆర్ఎల్ వద్ద గరిష్ట నీటి మట్టం 83.50 మీటర్లు. ప్రస్తుతం 81.60 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. భారీ వర్షాలకు ఎర్రకాల్వ జలాశయానికి ఎగువ నుంచి గంటకు 14,011 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు నుంచి 4,400 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అలాగే తమ్మిలేరు ప్రాజెక్టు ఎఫ్ఆర్ఎల్ వద్ద నీటిమట్టం 355 అడుగులు. ఖమ్మంజిల్లా బేతుపల్లి మినీ ప్రాజెక్టుకు అలుగు పడటంతో ఆంధ్రాకాల్వ ద్వారా తమ్మిలేరుకు వరద నీరు వస్తోంది. రేపు ఉదయానికి బేతుపల్లి నుంచి వచ్చే వరద ప్రాజెక్టుకు చేరుకునే అవకాశం ఉంది. తమ్మిలేరు క్యాచ్‌మెంట్‌లో కురిసిన వర్షాలకు ప్రస్తుత నీటిమట్టం 336.33 అడుగులకు చేరుకుంది. గోనెలవాగు గరిష్ట నీటిమట్టం 355 అడుగులు కాగా ప్రస్తుతం వర్షాలకు 335.54 అడుగులకు చేరుకుంది. వర్షాలు కొనసాగుతుండటంతో ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో నిండుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

జంగారెడ్డిగూడెం: పట్టణంలో గురువారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రోడ్లపై వరద నీరు ప్రవహించింది. దీంతో జనజీవనం స్తంభించింది. స్థానిక రాముడుకుంట ప్రాంతం, ఊరచెరువు ప్రాంతం జలమయం అయ్యాయి. బుట్టాయగూడెం రోడ్డులో ఉన్న లోతట్టు ప్రాంతం ఉన్న ఇళ్లల్లో వరద నీరు చేరింది. మార్కండేయపురం వద్ద సుద్ద కాలువ ఉధృతంగా ప్రవహించింది. జగనన్న కాలనీలకు వెళ్లేందుకు రహదారి వరదనీటితో మూసుకుపోయింది. లోతట్టు ప్రాంతాల్లో చేరిన వరద నీటిని తొలగించేందుకు మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ఆదేశాల మేరకు జేసీబీల సాయంతో దిగువకు నీరు వెళ్లేలా గాడిని తవ్వి సహాయక చర్యలు చేపట్టారు. రాముడుకుంట ఏరియా, పేరంపేట రోడ్డు, పశువుల ఆసుపత్రి వద్ద గల చెరువు ప్రాంతం, రామచంద్రాపురం ప్రాంతాల్లో, పద్మాథియేటర్ సమీపంలో జేసీబీల సహాయంతో గాడిని తవ్వి వరదనీటిని కిందకు ప్రవహించేలా ఏర్పాటు చేశారు. స్థానిక అశ్వారావుపేట రోడ్డు, ఏలూరు రోడ్డు, కొవ్వూరు రోడ్డు, బుట్టాయగూడెం రోడ్డు, అలాగే పట్టణంలో వివిధ రోడ్లు వరదనీటితో జలమయం అయ్యాయి. స్థానిక సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమంలో వరదనీరు చేరడంతో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ఆదేశాల మేరకు స్థానిక చంద్ర కళ్యాణ మండపంలో వృద్ధులకు పునరావాసం కల్పించారు. వీరికి మల్లిపూడి రవి ఆధ్వర్యంలో ఆహారాన్ని అందించారు.

ఉధృతంగా బైనేరు వాగు : భారీ వర్షాలకు బైనేరు వాగు పొంగి ప్రవహిస్తోంది. జంగారెడ్డిగూడెం పట్టణం, నరసన్నపాలెం గ్రామాల మధ్య ఉన్న బైనేరు వాగు ఎన్నడూ లేని విధంగా ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏజెన్సీ గ్రామాల్లో కురిసిన భారీ వర్షాలకు ఉప్పొంగిన బైనేరు వాగు, బైనేరు ఉమా రాలింగేశ్వరస్వామి ఆలయం నుంచి వాగులోకి దిగేందుకు ఏర్పాటు చేసిన మెట్ల మార్గం ముంచెత్తుతూ ప్రవహిస్తోంది.



జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్ ఆవరణలోకి ప్రవేశించిన వరద నీరు



జంగారెడ్డిగూడెం పట్టణంలో నీట మునిగిన రోడ్డు



రాముడుకుంట వద్ద నీటిని దిగువకు ప్రవహించేందుకు జేసీబీ ద్వారా గాడిని ఏర్పాటు చేస్తున్న దృశ్యం

రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

కామవరపుకోట: ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు రావికంపాడు గ్రామంలో ఓ చెట్టు నేలకొరిగింది. దీనితో ఆ మార్గంలో కొంతసేపు రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. అయితే స్థానికులు రోడ్డుపై అడ్డంగా పడిన చెట్టు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

శ్రీవారి క్షేత్రం.. జలమయం

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రం గురువారం జలమయమయ్యింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా ఆలయ పరిసరాల్లోకి భారీగా నీరు చేరింది. దర్శనం క్యూలైన్లలోకి వర్షపు నీరు చేరడంతో భక్తులు అందులోంచే ఆలయంలోకి వెళ్లారు. స్వామివారి దర్శనానంతరం ఉరుకులు, పరుగులు తీస్తూ ఆలయం నుంచి బయటకు చేరుకున్నారు. ఆలయ తూర్పు ప్రాంతం నీట మునిగింది. దాంతో భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. ఇదిలా ఉంటే భక్తులు క్షేత్రానికి చేరుకునే భీమడోలు–ద్వారకాతిరుమల మార్గంలోని పంగిడిగూడెం, గొల్లగూడెం వద్ద ప్రధాన రహదారిపై వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది. దాంతో ఆ ప్రాంతాలు కాలువలను తలపిస్తున్నాయి. అటుగా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు వర్షపు నీటితో నిండిపోయాయి.



క్యూలైన్లలోకి చేరిన వర్షపు నీరు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర



జంగారెడ్డిగూడెం: భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. ఈమేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కరాటం కృష్ణమూర్తి జలాశయం నిండడంతో జలాశయం గేట్లు తెరిచి నీటిని కిందకు వదులుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాలువ ప్రవహించే చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కల్వర్టుల వద్ద రోడ్లపై నీరు ప్రవహించేటప్పుడు రోడ్లు దాటవద్దని, కాలువలో పశువులను మేపడం కానీ, కాలువ ఒడ్డున సంచరించడం కానీ, కాలువలో ఈతలు కొట్టడం కానీ చేయవద్దన్నారు. అలాగే వాగులు రోడ్లపై ప్రవహిస్తున్న సమయంలో రోడ్లు దాటవద్దన్నారు. చింతలపూడి మండలంలోని నాగిరెడ్డిగూడెంలో ఉన్నా తమ్మిలేరు ప్రాజెక్టులోకి నీరు ఎక్కువగా వచ్చి చేరుతున్నందున ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని కిందకు విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని, కాబట్టి కాలువ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల్ని కాలువలు, వాగుల వద్దకు పంపవద్దని కోరారు. పాత కట్టడాలు నాని కూలిపోయే ప్రమాదమున్నందున ప్రజలు అటువంటి కట్టడాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

జంగారెడ్డిగూడెం: భారీ వర్షాల నేపథ్యంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధికారులు అప్రమత్తం ఉండాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆదేశించారు. అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. కాగా ఎప్పటికప్పుడు ఫోన్ ద్వారా అధికారులతో మాట్లాడుతూ పరిస్థితిని ఆయన సమీక్షిస్తున్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణాలకు రక్ష



చింతలపూడి: కోర్టు ఆవరణలో అవగాహన కలిగిస్తున్న దృశ్యం



జంగారెడ్డిగూడెం: ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

చింతలపూడి: హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడుకోవచ్చునని స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో గురువారం హెల్మెట్ వాడకంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ హెల్మెట్ వల్ల రోడ్డు ప్రమాదాల నుంచే కాకుండా దుమ్ము, ధూళి వల్ల ఊపిరితిత్తుల వ్యాధులు సోకకుండా రక్షణ పొందవచ్చునని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. కార్లు నడిపే వారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలి, కోర్టు సూపరింటెండెంట్ బి సత్యన్నారాయణ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల ప్రకారం గురువారం మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో హెల్మెట్ ఉపయోగాలను తెలుపుతూ కోర్టు ప్రాంగణం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. సీఐ రాజేష్ మాట్లాడుతూ మైనర్లకు ద్విచక్ర వాహనం ఇస్తే వాహన యజమానులకు, వాహనం నడిపే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హెల్మెట్ వినియోగంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఎంఈవో రాముడు, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ విత్తనాల రాజు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షపాతం వివరాలు ఇలా..

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్ పరిధిలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. వేలేరుపాడు మండలంలో అత్యధికంగా 246 మి.మీ వర్షపాతం నమోదుకాగా, బుట్టాయగూడెం మండలంలో 244.4 మి.మీ., జీలుగుమిల్లి మండలంలో 121 మి.మీ., ద్వారకాతిరుమల మండలంలో 68.మి.మీ., కొయ్యలగూడెం మండలంలో 106.4 మి.మీ., కుక్కునూరు మండలంలో 155.2 మి.మీ., పోలవరం మండలంలో 78 మి.మీ., కామవరపుకోట మండలంలో 83.4 మి.మీ., టి.నరసాపురం మండలంలో 80.6 మి.మీ., జంగారెడ్డిగూడెం మండలంలో 136.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.